క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

దుద్యాల్: ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో సాయి సేవా సమితి వనస్థలిపురం వారి సహకారంతో గీత సత్సంగ్ సేవా సమితి తాండూరు వారి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి తరలి వచ్చిన ప్రజలకు వైద్యులు వీర్రాజు, ఉపేంద్రలు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఏదైనా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి హైదరాబాద్‌లోని సంబంధిత ఆస్పత్రులకు రిఫర్ చేసినట్లు డాక్టర్లు తెలిపారు. సుమారు 200 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు ఆకారం శివ కుమార్ తెలిపారు.

ఘనంగా ఫాదర్స్ డే

మొయినాబాద్ రూరల్: మనల్ని ఈ లోకంలోకి తీసుకువచ్చేది అమ్మ అయితే.. ఆ లోకాన్ని పరిచయం చేసేది నాన్న అని యోగా సెంటర్ డైరెక్టర్ శ్రీనివాస్, మండల విశ్వకర్మ గౌరవ అధ్యక్షుడు నర్సింహ్మాచారిలు అన్నారు. ఆదివారం మండల పరిధి అజీజ్‌నగర్, అమ్డాపూర్ గ్రామాల్లో ఫాదర్స్ డేను కుటుంబ సభ్యులతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అజీజ్‌నగర్‌లో యోగా కేంద్రంలో డైరెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తన కూతుళ్లు, వివిధ గ్రామాలకు చెందిన సభ్యులతో కలిసి కేక్‌కట్ చేసి స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. అమ్డాపూర్‌లో మండల విశ్వకర్మ గౌరవ అధ్యక్షుడు నర్సింహ్మాచారి ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులతో కలిసి ఫాదర్స్‌డే ఉత్సవాన్ని జరుపుకున్నారు. ఇందులో యోగా సెంటర్ చైర్మన్ భారతీ, సభ్యులు లక్ష్మీప్రసన్న ఉన్నారు.

చకచకా 'ఆయూష్' నిర్మాణం



నిర్మాణంలో ఉన్న ఆయూష్ భవనం

అనంతగిరి: వికారాబాద్ పట్టణానికి సమీపంలోని అనంతగిరిగుట్టలో చేపట్టిన ఆయూష్ ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే స్లాబ్‌లు, రూంల నిర్మాణంతో బిల్డింగ్ పనులు పూర్తయ్యాయి. ఇంకా ప్లంబింగ్, విద్యుత్, టైల్స్, కిటికీలు అమర్చుట తదితర పనులు చేపట్టాల్సి ఉంది. మరో 3 నెలల్లో మిగతా పనులు పూర్తయి, భవనం అందుబాటులోకి రానుందని టీజీఎంఎస్‌ఐడీసీ డీఈ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కాగా.. రూ.15కోట్లతో 50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి 2023 ఏప్రిల్‌లో నాటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. అనంతగిరిలో పచ్చదనంతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణం ఉండటంతో అధికారులు అక్కడ ఆయూష్ నిర్మాణానికి మొగ్గు చూపారు.

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: అనారోగ్యాలకు గురై ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని మొదళ్లగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని మజీద్‌మామిడిపల్లికి చెందిన సుధాకర్ కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.2లక్షల యాభై వేల చెక్కును ఎమ్మెల్యే ఆదివారం ఆయన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదలు సైతం కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రారెడ్డి, నవీన్‌గౌడ్, సుదర్శన్, జంగయ్య, నర్సింహులు, నవీన్, రాజు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పశువు మృతి



ఘటనా స్థలంలో పశువు కళేబరం

యాలాల: విద్యుదాఘాతంతో ఓ పాడి పశువు మృత్యువాత పడింది. ఈ సంఘటన మండల పరిధి బాగాయిపల్లి శివారులో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సింహ్మారెడ్డికి చెందిన పశువు ఎప్పటిలాగే గ్రామ శివారులో మేతకు వెళ్లింది. మేత మేస్తూ సమీపంలోని విద్యుత్ స్తంభం సపోర్ట్ తీగకు తాకింది. దీంతో కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. జీవనాధారమైన పశువు మృతి చెందడంతో రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

ఇంటర్ కల.. నెరవేరిన వేళ

ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఇంటర్ కళాశాల కల నెరవేరింది. ఎక్కడో కాకుండా.. కొత్తగా స్థానిక పాఠశాల భవనంలోనే ప్రభుత్వం కాలేజీని ఏర్పాటు చేసి, మండల పరిసర ప్రాంత విద్యార్థులకు మాధ్యమిక విద్యను అందుబాటులోకి తెచ్చింది. దీంతో విద్యార్థులకు ఇంటర్ విద్య చేరువై.. దూరభారం తప్పినట్లయింది.

- జూనియర్ కాలేజీ ఏర్పాటు
- ప్రారంభమైన అడ్మిషన్లు
- హర్షం వ్యక్తంచేస్తున్న గ్రామస్తులు



జూనియర్ కళాశాల భవనం

దౌల్తాబాద్: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో గతేడాది దౌల్తాబాద్ మండలానికి ప్రభుత్వం జూనియర్ కళాశాలను మంజూరు చేసింది. ఈ విద్యా సంవత్సరం 2024–25 నుంచి తరగతులు ప్రారంభించనున్నారు. అందులో భాగంగా అధ్యాపకులు అడ్మిషన్లు తీసుకుంటున్నారు. దీంతో ఫీజులు చెల్లించి ప్రైవేటుకు వెళ్లని మారుమూల ప్రాంతాల విద్యార్థులకు ఈ కళాశాల ఏర్పాటు వరంగా మారింది. గతంలో ఇక్కడ కాలేజీ లేకపోవడం వలన మండల విద్యార్థులు కోస్గి, తాండూరు, కొడంగల్ పట్టణాలకు వెళ్లి మాధ్యమిక విద్య(ఇంటర్)ను అభ్యసించేవారు.

పాఠశాల భవనంలో..

స్థానికంగా కళాశాల ఏర్పాటు చేయడంతో మండలంలోని మండల కేంద్రంతో పాటు బాలంపేట, గోకఫసల్‌వాద్, చంద్రకల్, చల్లాపూర్, యాంకి, ఇందాపూర్ తదితర గ్రామాల విద్యార్థులకు మేలు జరగనుంది. ప్రస్తుతం కళాశాలకు సొంత భవనం లేదు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న భవనంలోనే తరగతులు నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తి చేశారు.

అడ్మిషన్లు ప్రారంభం

జూనియర్ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమయింది. కళాశాలకు అవసరమయ్యే సామగ్రిని దాతలు విరాళంగా అందజేస్తున్నారు. కళాశాలలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులున్నాయి. అడ్మిషన్లు తీసుకుకోవాలని ఇప్పటికే ప్రిన్సిపాల్ శంకర్‌నాయక్ తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు కళాశాలలో చేరాలని, ఇక్కడ అందించే పాఠ్యపుస్తకాలు, ఉపకార వేతనాలు, రాత పుస్తకాలు తదితర సౌకర్యాలపై అవగాహన కల్పిస్తున్నారు.

అందరి సహకారంతోనే

ప్రభుత్వం గతేడాది దౌల్తాబాద్‌కు జూనియర్ కళాశాలను మంజూరు చేసింది. ఈ విద్యాసంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. అందరి సహకారంతో ముందుకు సాగుతాం. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా కృషి చేస్తున్నాం.

– శంకర్‌నాయక్, ప్రిన్సిపాల్, దౌల్తాబాద్



పూర్వ ఉపాధ్యాయులతో విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

కుల్కచర్ల: మూడు దశాబ్దాల అనంతరం బాల్యమిత్రులందరూ ఏకమయ్యారు. ఒకే వేదికగా నాటి చిలిపి చేష్టలు, జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ కేరింతలు కొట్టారు. ఆడుతు పాడుతూ.. ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. మండల పరిధి ముజాహిద్‌పూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1994–95 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న నాటి విద్యార్థులు.. ఆదివారం అపూర్వ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులతో తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. ఇందులో నాటి ఉపాధ్యాయులు అబీబ్ అహ్మద్, నర్సింలు, వెంకటయ్య, నర్సింలు, రాములు, విద్యార్థులు గోవర్ధన్, వెంకట్, యాదయ్య, రఘునాథ్, విజయనిర్మల, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, జిల్లా, నియోజకవర్గ, పట్టణ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. – అనంతగిరి

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం ఎంతో సురక్షితమని డిపో మేనేజర్ ఉష అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సంస్థ అమలు చేస్తున్న పథకాలపై కళాజాత బృందం సభ్యులు ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. ఆర్టీసీ బసస్సుల్లో ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు ఎంతో సురక్షితంగా చేరవేస్తామని వెల్లడించారు. ఆర్టీసీలో అనుభవం కలిగిన డ్రైవర్లు ఉంటారని, ప్రయాణికుల క్షేమమే లక్ష్యంగా బస్సులను నడుపుతారని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు ప్రయాణ రాయితీలను ఇవ్వడంతో పాటు, పరీక్షల సమయాల్లో ఉచిత ప్రయాణం చేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కళాజాత బృందం సభ్యులను డీఎం సన్మానించారు. అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, నాగులు, అర్జున్ కుమార్, వెంకటేశ్, కళాజాత బృందం సభ్యులు గోపయ్య, సంపత్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం

రాష్ట్రంలో ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డీఎం ఉష అన్నారు. లక్షే లక్ష్యంలో భాగంగా సంస్థ ఎండీ.సజ్జనార్ ఆదేశాల మేరకు రెండు రోజుల క్రితం ఉద్యోగుల పిల్లలకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ప్రతి భ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగుల పిల్లల మేధస్సుకు పదును పెట్టేందుకు వ్యాసరచన పోటీలను నిర్వహించామన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలు అత్యుత్తమ ప్రతిభన కనబరిచారని తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిని విద్యార్థుల తల్లితండ్రులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

ఎస్‌ఐ స్రవంతి



మందులు పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ స్రవంతి

బంట్వారం: వానాకాలం సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోట్‌పల్లి ఎస్‌ఐ స్రవంతి సూచించారు. జేకేఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోట్‌పల్లి మండలం జిన్నారంలో అపోలో ఆస్పత్రి వైద్యులు ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ చెప్పారు. ఇదిలా ఉండగా.. వైద్య శిబిరంలో వైద్యులు 120 మందికి సాధారణ వైద్య పరీక్షలు చేశారు. అనంతరం అవసరమైన మందులు పంపణీ చేశారు. కంటి సమస్యతో బాధపడుతున్న 25 మందిని గుర్తించారు. వీరిని త్వరలోనే అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లి, ఆపరేషన్ చేయనున్నట్లు వైద్యులు వెల్లడించారు. కార్యక్రమంలో పోగ్రామ్ ఆర్గనైజర్ మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ బందయ్య, వైద్యులు అరుంధతి, అలేఖ్య, వరప్రసాద్, వెంకట్‌రెడ్డి, కేశవ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



బోరుమోటారు వద్ద దాత లక్ష్మణ్‌నాయక్‌తో తండావాసులు

బొంరాస్‌పేట: తండావాసుల తాగునీటి సమస్య పరిష్కారానికి ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుడు లక్ష్మణ్‌నాయక్ స్పందించారు. సొంత డబ్బు వెచ్చించి ఆదివారం బోరు మోటారు బిగించి సమస్య తీర్చారు. ఈ సందర్భంగా తండా వాసులు మాట్లాడారు. తాగునీటి పరిష్కారం కోసం మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి గతంలో బోరువేయించారని తెలిపారు. కానీ మోటారు బిగించక పోవడంతో సమస్య అలాగే ఉండిపోయిందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి చెప్పినా పట్టించుకోలేదని ఆరోపించారు. తాగునీటి కష్టాలను తీర్చేందుకు లక్ష్మణ్‌నాయక్‌కు ముందుకు వచ్చి, మోటారు బిగించారని తెలిపారు. ఈ సందర్భంగా దాత లక్ష్మణ్‌కు తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుల వేతన వెతలు



పారిశుద్ధ్య పనుల్లో కార్మికులు

- ఎనిమిది నెలలుగా జీతాలు లేవు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

కుల్కచర్ల: గ్రామ పరిరక్షణ, ప్రజారోగ్య సంరక్షణకు నిత్యం చెమటోడుస్తున్న పారిశుద్ధ్య కార్మికులు.. అర్ధాకలితో అలమటిస్తున్నారు. రెక్కాడితే కాని డొక్కాడని కష్టజీవులు.. సుమారు ఎనిమిది నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కారణాలు ఏమైనప్పటికీ... సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు విన వస్తున్నాయి. మండల పరిషత్‌లో 44 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న కార్మికులకు 6 నుంచి 8నెలలుగా జీతాల చెల్లింపు లేదు. పని చేస్తున్నా.. చేతిలో పైసలు లేక.. అప్పు చేస్తూ.. రోజువారి జీవితాన్ని గడుపుతున్నారు. వేతనాలు చెల్లించాలంటూ మండల పరిధి తిర్మలాపూర్ గ్రామంలో జీపీ కార్మికులు పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అయినప్పటికీ వారి ఆందోళన విన్నవారే లేనట్లు తెలుస్తోంది.

కష్టంగా ఉంది..



ఆరు నెలలు గడుసున్నా జీతాలు లేవు. అధికారులను అడిగితే రేపు మాపు అంటున్నారు. కానీ పైసలు ఇవ్వటం లేదు. అప్పు చేసి కడుపు నింపుకుంటున్నాం. మా ఇబ్బందులు గ్రహించి, వేతనాలు ఇప్పించండి.

– పోతగళ్ల వెంకటయ్య, కార్మికుడు

త్వరలో వస్తాయి



ఎన్నికల నిర్వహణ, కోడ్ వలన కార్మికుల జీతాల విడుదలలో జాప్యం జరిగింది. కొన్ని గ్రామాల్లో జీతాలు విడుదల కాగా.. మిగతావి జీపీల వారీగా త్వరలోనే వస్తాయి. ఏదైనా ఇబ్బందికర పరిస్థితులు ఉంటే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– రామకృష్ణ, ఎంపీడీఓ, కుల్కచర్ల

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

పరిగి: రాష్ట్ర విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయి గణేశ్ ప్రభుత్వాన్ని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వం కొలువు దీరి ఆరు నెలలు అయినా.. మంత్రిని నియమించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. దీని వలన విద్యా వ్యవస్థ గాడి తప్పుతుందని, ప్రభుత్వ స్పందించి, వెంటనే ఆ శాఖకు మంత్రిని ఏర్పాటు చేయాలని కోరారు.

సమస్యల ఒడిలో ధర్మాస్పత్రి

సౌకర్యాల లేమితో ప్రాథమిక వైద్యశాల కొట్టుమిట్టాడుతోంది. నాడు నిరంతరం వైద్య సేవలు అందించిన ఆస్పత్రి.. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా నేడు వెలవెలబోతోంది. ఉండటానికి గదులు లేక వైద్య సిబ్బంది ఇబ్బంది పడుతుండగా.. సరైన వైద్య సేవలు అందక రోగులు ప్రైవేటు దవాఖానలకు పరుగు తీస్తున్నారు.

- సిబ్బందికి వసతులు కరువు
- వేధిస్తున్న వైద్యుల కొరత
- వైద్యం అందక ప్రైవేటు ఆస్పత్రులకు రోగుల పరుగు
- నిరంతరం వైద్య సదుపాయాలకు డిమాండ్





పీహెచ్‌సీ కేంద్రం (ఇన్‌సెట్లో) శిథిలావస్థలో వైద్యుల క్వార్టర్స్

పెద్దేముల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గతంలో వైద్య సిబ్బంది, రోగులు, వారి వెంట వచ్చే సహాయకులతో సందడిగా ఉండేది. 24గంటల వైద్య సదుపాయాలతో పాటు.. కుని, సాధారణ కాన్పులు నిర్వహిస్తుండటంతో మండల పరిధి ప్రజలే కాకుండా.. పొరుగు ప్రాంతాల వారు చికిత్స కోసం ఈ వైద్యశాలను ఆశ్రయించేవారు. కానీ.. గత ప్రభుత్వం 24గంటల బదులు 12గంటలకు వైద్య సేవలను కుదించడతో.. వైద్య సేవలు తగ్గిపోయాయి. ఇద్దరు వైద్యులకు బదులు ఒక్కరే ఉండటం, సమయానికి వైద్యం అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొంత కాలంగా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స థియేటర్ మూత పడగా.. ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పుకునే ప్రజాప్రతినిధులు, వైద్య సేవలు మెరుగు పర్చాల్సింది పోయి.. నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

44వేల జనాభాకు ఇదే దిక్కు

కర్ణాటక సరిహద్దు మండలం అయిన పెద్దేముల్‌లో 37 గ్రామ పంచాయతీలు ఉండగా.. అందులో 44వేల జనాభా ఉంది. వీరందరికీ ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రమే దిక్కు. అలాంటి దవాఖానలో వైద్య సదుపాయాలు లోపించడంతో రోగులు తాండూరు, వికారాబాద్ జిల్లా ఆసుపత్రులకు వెళ్తున్నారు. మరికొంత మంది పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్రం కుంచారం, షాదీపూర్ ప్రాంతాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు.

మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం

పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవ లు అందిస్తున్నాం. సిబ్బందికి క్వార్టర్స్ లేవన్న విషయం వాస్తవమే. 12కిలో మీటర్ల దూరం నుంచి నిత్యం వస్తున్నారు. రోగులకు అన్ని వసతులు కల్పిస్తున్నాం. ఏదైనా సమస్య ఉంటే ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం.

– బుచ్చిబాబు, వైద్యుడు పీహెచ్‌సీ, పెద్దేముల్

పట్టించుకోని అధికారులు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సౌకర్యాలు, వైద్య సదుపాయాల సంగతి ఎలా ఉన్నా.. రాత్రి వేళల్లో కనీసం విద్యుత్ దీపాలు వెలగక పోవడం బాధాకరంగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఒకే వైద్యుడు ఉండటం, 24 గంటల పాటు వైద్య సేవలు లేకపోవడం వెరసి.. సకాలంలో వైద్యం అందక రోగులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో.. ఇదే విషయాన్ని మండల సర్వసభ్య సమావేశంలో మాజీ సర్పంచ్‌లు పలుమార్లు ప్రస్తావించారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు లేకపోలేదు. పేరుకే ధర్మాస్పత్రి అని, అత్యవసర సమయంలో అందరూ చేతులు ఎత్తేస్తున్నారని నాగులపల్లి మారేపల్లి, తింసాన్‌పల్లి, జనగాం, రుద్రారం, ఇందూరు, తట్టిపల్లి, అడ్కిచెర్ల ప్రజలు వాపోతున్నారు.

ప్రభుత్వం స్పందించాలి



పీహెచ్‌సీలో 24గంటల పాటు వైద్య సేవలు అందించాలి. ఇద్దరు పర్మినెంట్ వైద్యులను నియమించి, సిబ్బందికి పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలి. అప్పుడే పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుంది. కుటుంబ నియంత్రణ చేయడంలో జిల్లాలోనే పెద్దేముల్ మొదటి స్థానంలో ఉండేది. ప్రస్తుతం ఆ ఆపరేషన్ థియేటర్ మూత పడింది. సర్కారు స్పందించి, సమస్యను పరిష్కరించాలి.

– శ్రీనివాస్‌రెడ్డి రైతు నాగులపల్లి

30 పడకలుగా మార్చాలి



ప్రస్తుతం 6 పడకలుగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆస్పత్రిగా మార్చాలి. సౌకర్యాలు కల్పించి, నిరంతరం వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలి. జడ్పీ చైర్ పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి.. సత్వరమే స్పందించి, ప్రజారోగ్యంపై దృష్టి సారించాలి. సమస్యలు పరిష్కరించాలి. అప్పుడే పేదలకు మెరుగైన వైద్యం అందుతుంది.

–మొగులప్ప, మాజీ సర్పంచ్, ఇందూరు

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



పీహెచ్‌సీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. వైద్య సిబ్బందికి వసతి సౌకర్యాలతో పాటు.. ఆస్పత్రికి వచ్చే రోగులకు తగిన మౌలిక వసతులు కల్పిస్తాం. 24గంటల వైద్య సేవలు అందేలా కృషి చేస్తాం. అత్యవసర సమయంలో వైద్యులు అందుబాటులో ఉండేలా చూస్తాం. సమస్యను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు మంజూరు అయ్యేలా చుస్తాం.

–అనురాధ (ఆస్పత్రి కమిటీ చైర్ పర్సన్) ఎంపీపీ, పెద్దేముల్ మండలం

కష్టపడితేనే.. ఉజ్వల భవిష్యత్

మొయినాబాద్: కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధి చిలుకూరులో కళాశాల వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని.. ముందడుగు వేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆట, పాటలతో సందడి చేశారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఇండస్ట్రీలిస్టులు మధూకర్, దినాకర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

నందిగామ: క్రీడల్లో యువత తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని, ఇలాంటి పోటీల్లో గెలుపోటములు సహజమని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధి మొదళ్లగూడలో కొన్ని రోజులుగా సాక్షిత్‌రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నీని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజేత జట్టుకు రూ.25వేల నగదుతో పాటు కప్, రన్నర్‌గా నిలిచిన టీమ్‌కు రూ.15వేల నగదు, జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న క్రీడలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో మాజీ సర్పంచ్ ఉమారెడ్డి, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, ప్రేమ్‌గౌడ్, ఎంపీటీసీ మాధవి, లక్ష్మి, గ్రామస్తులు రవీందర్, షఫీ, అబ్బాస్, శ్రీను, రాజు, సునీత, భాగ్యమ్మ, యాదమ్మ, ఆంజనేయులుగౌడ్, హనుమంత్‌రెడ్డి, సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రెడ్డి, క్రీడాకారులు ఉన్నారు.